నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, గురువారం 4 జూలై 2024 SANGAREDDY



సిద్దిపేటలో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

# ప్రతిఒక్కరూ ప్రజల్లో ఉండి సేవ చేయాలి

- ప్రభుత్వంలో ఉన్నా.. లేకున్నా ప్రజల కోసం పోరాడుదాం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- వచ్చేది మన ప్రభుత్వమే...
- రైతుభరోసా అమలులో జాప్యం
- కోత పెట్టేందుకు ఆలస్యం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- సెల్ఫీ తీసుకొని రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం
- మంచి పనులే శాశ్వతంగా నిలుస్తాయి
- ఎంపీటీసీ, జడ్పీటీసీల సన్మానంలో మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, జూలై 3: ప్రతిఒక్కరూ ప్రజల్లో ఉండి సేవ చేయాలని, ప్రభుత్వంలో ఉన్నా, లేకున్నా ప్రజల కోసం పోరాడుదామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఆ పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట, నంగునూరు మండలాల ఎంపీటీసీ, జడ్పీటీసీల సన్మాన కార్యక్రమంలో పాల్గొని ప్రజా ప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసిన పాపానికి రైతులకు ఆత్మహత్యలే శరణ్యమయ్యాయన్నారు. పదవి విరమణ అనేది ప్రజాసేవకు కాదన్నారు. నాయకులు అంటేనే నిరంతరం ప్రజల మధ్య ఉండే వారని, పదవి లేకపోయినా, మనం పదవిలో ఉన్నప్పుడు ఎంత బాగా పనిచేశామన్నదే శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. ప్రజల సాకారంతో ఐదేండ్లలో చరిత్రలో నిలిచిపోయే పనులెన్నో చేశారన్నారు. ఐదేండ్లలో ప్రజలకు సేవ చేసే భాగ్యం మీకు కలిగిందన్నారు. మునుముందు మరిన్ని మంచి అవకాశాలు రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పదవులున్నా లేకున్నా అందరికీ సమానమైన గౌరవం ఉంటుందని, అందరినీ కాపాడుకొని సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఐదేండ్లలో గ్రామాలకు గోదావరి జలాలు తెచ్చే సాగునీటి కల సాకారమైందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల్లో పచ్చని చెట్లు స్వాగత తోరణాలుగా స్వాగతం పలికేవన్నారు. నేడు ఏ గ్రామానికి వెళ్లినా చెత్త కుప్పలు స్వాగతం పలుకుతున్నాయని హరీశ్‌రావు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే కరెంట్ కష్టాలు మళ్లీ వచ్చాయని, కాలిపోయిన మోటర్లు, ఇన్వర్టర్ల కాలం వచ్చిందన్నారు. ఖమ్మం జిల్లాలో రైతు ప్రభాకర్ సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమైన విషయం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, ప్రాధాన్యత లేని పాలనగా మారిందన్నారు. కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా మంజూ రు చేయలేదన్నారు. పంచాయతీ సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్లు సొంత డబ్బులతో పాలన లాక్కొస్తున్నారని చెప్పారు. ఇప్పుడు వారు కూడా చేతులెత్తేయడంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ జరగటం లేదన్నారు.

**బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్నివర్గాలకూ భరోసా..**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అన్ని వర్గాల వారికి భరోసా ఉండేదని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 24 గంటల కరెంట్, కాలంతో పనిలేకుండా కాళేశ్వరం నీళ్లతో పంట వేసుకుందామనే నమ్మకం రైతుల్లో ఉండేదన్నారు. ఇప్పుడు రైతులు పంటలు వేస్తే నీళ్లు రావనే ఆందోళనలో ఉన్నారన్నారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా, రైతన్నలకు ఎరువులు, రైతు భరోసా డబ్బులు ఇవ్వకుండా కోత విధించేందుకు ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ముచ్చటే లేదన్నారు. సర్కార్ దవాఖానల్లో మందులు లేక బయట మెడికల్ షాపులకు చిట్టీలు రాస్తున్నారు. కసీఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్టును బంద్ పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని, వచ్చేది మన ప్రభుత్వమే అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజల్లో ఉండి సేవ చేస్తే మళ్లీ మీరే గెలిసి ఉన్నత పదవులు పొందే అవకాశం ఉన్నదని హరీశ్‌రావు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీలు శ్రీదేవీచందర్‌రావు, ఒగ్గు బాలకృష్ణ, జడ్పీటీసీలు శ్రీహరి గౌడ్, కుంభాల లక్ష్మి రాఘవరెడ్డి, ఉమా వెంకటరెడ్డి, నాయకులు తుపాకుల బాల్ రంగం, జాప శ్రీకాంత్ రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, ప్రభాకర్ వర్మ, కిష్టారెడ్డి, అల్లం ఎల్లం, సంగు పురేందర్, కోల రమేశ్‌గౌడ్, దువ్వల మల్లయ్య, నారా గౌడ్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# కేసీఆర్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

**ఆరు గ్యారెంటీలను విస్మరించిన ప్రభుత్వం**

- గౌతోజిగూడెం ఆదర్శ గ్రామంగా నిలువడం అభినందనీయం
- మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్ గౌడ్, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



మనోహరాబాద్ మండలం గౌతోజిగూడెంలో అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్ గౌడ్, ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

మనోహరాబాద్, జూలై 3: కేసీఆర్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని, మారుమూల పల్లెలు సైతం ఆదర్శ గ్రామాలుగా నిలిచాయని మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్ గౌడ్, ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజిగూడెంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ఒకప్పుడు మధిర గ్రామాలకు నిధులు రావాలంటే కష్టతరంగా ఉండేదని, కేసీఆర్ కృషితో మధిర గ్రామాలు, తండాలు పంచాయతీలుగా ఏర్పడి ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. మారుమూల గ్రామమైన గౌతోజిగూడెం జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో ఆదర్శ గ్రామంగా అవార్డులు తీసుకోవడం అభినందనీయమన్నారు. సమష్టి కృషితో ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉన్నం దు వల్లే ఇది సాధ్యపడిందన్నారు. గ్రామంలో మిగిలిన అభివృద్ధి పనులకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్ అధ్యక్షతన గ్రామ ప్రజాప్రతినిధులను, పాత్రికేయులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

**ఆరు గ్యారెంటీలు ఎక్కడా: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మాటను మరిచిపోయిందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి దుయ్యబట్టారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్, మహిళలకు రూ.2500, రూ.500లకే గ్యాస్ వంటి ఎన్నో హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు. వాటన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ్వంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణ గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, పూల అర్జున్, మాధవరెడ్డి, ఉప సర్పంచ్‌ల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు పంచమి రేణుకుమార్, ఉప సర్పంచ్ మహేందర్ గౌడ్, నాయకులు భిక్షపతి, ఆనంద్, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధుల సేవలు వెలకట్టలేనివి



దుబ్బాకలో సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణ శర్మ దంపతులను సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- పదవికి విరమణ తప్ప, ప్రజాసేవకు ఉండదు..
- స్థానిక ప్రజాప్రతినిధులకు జీతాలు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ సర్కారు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సన్మానం

దుబ్బాక, జూలై 3: కరోనాను లెక్కచేయకుండా ప్రజాసేవలో అంకితమైన స్థానిక ప్రజాప్రతినిధుల సేవలు వెల కట్టలేనివని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కొనియాడారు. బుధవారం దుబ్బాకలోని రజనీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో దుబ్బాక నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఏఎంసీ చైర్మన్లను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రజాసేవలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సేవలు చాలా గొప్పవన్నారు. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజమని, గెలుపోటములు శాశ్వతం కాదన్నారు. ఓటమి తర్వాత గెలుపు ఉంటుందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారేనని స్థానిక ప్రజాప్రతినిధులకు, బీఆర్‌ఎస్ శ్రేణులకు ఆయన ధీమా కల్పించారు. పని చేసే నాయకులకు, కార్యకర్తలకు పార్టీలో గుర్తింపుతోపాటు ప్రజల అండ ఉంటుందన్నారు. పదవికి విరమణ ఉంటుందని, ప్రజాసేవకు విరమణ ఉండదన్నారు. మీ సేవలను గుర్తు చేస్తూ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆత్మీయ సన్మానం నిర్వహించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు జీతాలు ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో ఉందని మండిపడ్డారు. కనీసం పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. పల్లెలు మురుగు కుపాలుగా అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ కోతలు, కరెంట్ కోతలు, సంక్షేమ పథకాల బంద్‌లు కొనసాగిస్తుందని ఎద్దేవా చేశారు.

**దుబ్బాక నియోజకవర్గంలో అభివృద్ధి సున్నా....**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా దుబ్బాక నియోజకవర్గంలో ఏ ఒక్క అభివృద్ధి జరుగలేదని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించడంతోపాటు ఎంపీ ఎన్నికల్లో మంచి మెజార్టీ ఇచ్చినందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కృషి మరిచిపోలేనిదన్నారు. పదవీకాలం ముగిసినంత మాత్రాన ఆందోళన చెందవద్దని, ప్రజా సేవ చేసే నాయకులకు ప్రజాధరణ ఉంటుందన్నారు. సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పల్లెప్రగతి కార్యక్రమాలతో పల్లెల రూపురేఖలు మారిపోయాయని గుర్తు చేశారు. కేసీఆర్ సర్కారులో ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచాయన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో విశ్వాసం పోయిందని, మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా ఎన్నుకునే విషయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సహకారం మరిచిపోలేనిదన్నారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి తనవంతుగా కృసి చేస్తానని హామీనిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్ మాట్లాడుతూ అవినీతిపరులు, అక్రమార్కులు, ఆశా వాదులు మాత్రమే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి పోతున్నారన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్‌రావు, వెంకటనర్సింహారెడ్డి , రజనీకాంత్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, రొట్టె రాజమౌళి, ఎల్లారెడ్డి, నియోజవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పీఏసీఎస్, ఏఎంసీ చైర్మన్లు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఎంపీపీ పుష్పలతాకిషన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# ప్రజాసేవే మళ్లీ గెలిపిస్తుంది..

**రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్**



కోహెడలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలతో మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ జూలై 3: ప్రజాసేవే మళ్లీ గెలిపిస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కోహెడ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాల శాఖ, మిషన్ భగీరథ శాఖలపై సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజక వర్గం అభివృద్ధిలో పరుగులు పెట్టాలన్నారు. కష్టపడిన వారు బయపడేది లేదని, వారిని మళ్లీ ప్రజలు ఆశీర్వదిస్తారన్నారు. వంట గ్యాస్, విద్యుత్ బిల్లులు మాఫీకావటం లేదని ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకురాగా త్వరలో సమీక్ష జరిపి ఎవరికీ ఇబ్బందులు లేకుండా చేస్తానన్నారు. ప్రజా ప్రతినిధులు పదవి పోయిందని బాధపడొద్దని, నిత్యం ప్రజాసేవలో ఉండాలన్నారు. అనంతరం ఎంపీపీ కొక్కుల కీర్తిసురేశ్, జడ్పీటీసీ నాగరాజు శ్యామలామధుసూదన్‌రావు, ఎంపీటీసీలను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఎంపీటీసీలు, అధికారులు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కీర్తి, జడ్పీటీసీ నాగరాజు శ్యామల, వైస్‌ఎంపీపీ తడ్కల రాజిరెడ్డి, సీనియర్ నాయకులు కర్ర శ్రీహరి, కొక్కుల సురేశ్, ఎంపీటీసీలు, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కుమార్, వివిధ శాఖల అధికారులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్యారోగ్యశాఖ మంత్రి

**జోగిపేట ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది ఇష్టారాజ్యం**

# ఇలాకాలో వైద్యానికి సుస్తీ

- రోగులకు సెలైన్ పెట్టి అందుబాటులో లేకుండా పోయిన సిబ్బంది
- రోగుల సహాయకులే సెలైన్లు తొలిగించే పరిస్థితి
- అందుబాటులో లేని బెడ్‌షీట్లు...చిరిగిన పరుపులు
- ప్రసూతి వార్డులో కంపుకొడుతున్న టాయిలెట్లు...ఇబ్బందుల్లో బాలింతలు
- పేరుకే పెద్ద దవాఖాన... పేదలకు అందని మెరుగైన వైద్యం
- ప్రతి పనికీ డబ్బులు అడుగుతున్న కిందిస్థాయి సిబ్బంది
- నరకం చూస్తున్న రోగులు



జోగిపేట దవాఖాన ఎదుట లోపించిన పారిశుధ్యం



జోగిపేట దవాఖానలోని ప్రసూతి వార్డులో పేరుకుపోయిన చెత్త



సెలైన్ పెట్టి తీయకపోవడంతో సెలైన్ తొలిగిస్తున్న రోగుల సహాయకులు

అందోల్, జూలై 3: వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలో సర్కారు వైద్యానికి సుస్తీ చేసింది. అందోల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో జోగిపేటలో ఏర్పాటు చేసిన 100 పడకల దవాఖానలో వైద్యసేవలు సరిగ్గా అందక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దవాఖానలో 14 మంది డాక్టర్లు, 40 మంది నర్సులు, 38 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. సరిపడా సిబ్బంది ఉన్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సేవలు సరిగ్గా అందడం లేదు. బుధవారం నమస్తే 'తెలంగాణ' దవాఖానను సందర్శించగా అనేక సమస్యలు కనిపించాయి. రోగులకు సెలైన్లు పెట్టిన సిబ్బంది అక్కడ పత్తాలేకుండా పోయారు. ఓ గర్భిణీకి సెలైన్ పూర్తిగా అయిపోవడంతో దానిని తీసేందుకు వైద్య సిబ్బంది కోసం దవాఖాన మొత్తం వెతికినా ఎవరూ అందుబాటులో లేకపోవడంతో రోగి సహాయకులే సెలైన్లు తొలిగించారు. బ్రాహ్మణపల్లికి చెందిన గర్భిణీ ప్రసవించగా.. చిన్నారి బరువు తక్కువగా ఉండడంతో ఐసీయూలో ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ఆ చిన్నారి కోసం తల్లిదండ్రులు అక్కడికి రాగా సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడం, అక్కడ గంటపాటు ఎదురుచూసినా ఎవరూ అక్కడికి రాకపోవడంతో చిన్నారిని తీసుకుని ప్రసూతి వార్డుకు వెళ్లారు. పుట్టిన పిల్లలను ఇలా ఒంటరిగా వదిలేస్తే ఎలా...? మేము కాకుండా పిల్లలను ఎవరైనా తీసుకెళ్తే ఎవరిది బాధ్యత అంటూ చిన్నారి తల్లిదండ్రులు ప్రశ్నించారు. వైద్యసిబ్బంది కోసం రిసెప్షన్‌తో పాటు వారి గదుల్లో వెతికినా లేరని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని చిన్నారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. జోగిపేట దవాఖానలో బెడ్ల మీద బెడ్‌షీట్లు కరువయ్యాయి. బెడ్‌షీట్లు లేకున్నా రోగులను అలాగే బెడ్ల మీద పడుకోబెడుతున్నారు. పూర్తిగా చిరిగిన బెడ్లను సైతం రోగుల కోసం వాడుతుండడం ఇక్కడి వైద్యసేవల దుస్థితికి అద్దం పడుతున్నది.



దవాఖాన ఎదుట కంపుకొడుతున్న చెత్త



పూర్తిగా ఇరిగిపోయిన బెడ్

**ప్రసూతి వార్డులో కంపుకొడుతున్న టాయిలెట్లు..**

గర్భిణులు, బాలింతలు ఉండే వార్డులో టాయిలెట్లు కంపు కొడుతున్నాయి. మూడు రోజులుగా బాలింతలు వాడిన డైపర్స్, ఇతరత్రా వస్తువులు అక్కడే ఉంచారు. దీంతో భరించలేని కంపుతో ఇబ్బందిగా ఉందని బాలింతలు, వారి సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. టాయిలెట్లు సైతం సరిగా శుభ్రం చేయడం లేదని, తప్పనిసరి పరిస్థితిలో భరిస్తూ ఇక్కడే ఉంటున్నామని వాపోయారు. ఇక్కడ పనిచేసే కిందిస్థాయి సిబ్బంది ప్రతి పనికీ డబ్బులు అడుగుతున్నారని, ఇవ్వకుంటే తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోపలి గదులతోపాటు దవాఖాన చుట్టూ పరిసరాలు సైతం కంపుకొడుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. పిచ్చి మొక్కలు పెరిగాయి. నల్లాల వద్ద వ్యర్థాలు నిలిచి దుర్గంధం వ్యాపిస్తున్నది. దీంతో రోగాలు తగ్గే మాట దేవుడెరుగు కొత్త రోగాలు బారినపడతామని రోగులు, సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆరోగ్యశాఖ మంత్రి హెచ్చరించినా మారని తీరు..**

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలో జోగిపేట దవాఖానలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని పలుమార్లు రివ్యూలు నిర్వహించి వైద్యసిబ్బందికి ఆదేశించారు. కానీ ఇక్కడి పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. వైద్యసిబ్బంది ఇష్టానుసారంగా విధులకు వచ్చి వెళ్తున్నారు. దవాఖానలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పరిసరాలు కంపుకొడుతున్నాయి. దీంతో రోగులు నరకం అనుభవిస్తున్నారు.



దవాఖాన రిసెప్షన్‌లో అందుబాటులో లేని సిబ్బంది

**మూడురోజులుగా కంపుకొడుతున్నది..**



మూడు రోజులుగా ప్రసూతి వార్డులోని బాత్రూం కంపుకొడుతున్నది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వాడిన వస్తువులు అక్కడే పడేశారు. వాటిని తీసుకెళ్లాల్సిన సిబ్బంది రాకపోవడంతో దుర్గంధంతో ముక్కు మూసుకుని కూర్చుంటున్నాం. పారిశుధ్య సిబ్బంది పైపైనా పనులు చేసి వెళ్తున్నారు. టాయిలెట్ల నుంచి వచ్చే వాసన భరించలేకపోతున్నాం. ఏమన్నా అంటే దురుసుగా మాట్లాడుతున్నారు. ప్రతి పనికీ డబ్బులు అడుగుతున్నారు. ఇవ్వకుంటే తిడుతున్నారు.

**-గౌరమ్మ, దేవునూర్, వట్‌పల్లి మండలం (సంగారెడ్డి జిల్లా)**

**చిన్నారిని ఒంటరిగా వదిలేసి వెళ్లారు..**



మాకు పాప పుట్టింది. బరువు తక్కువగా ఉండడంతో ఐసీయూలో ఉంచారు. బుధవారం పాపను చూసేందుకు ఐసీయూ వద్దకు వెళ్లగా అక్కడ సిబ్బంది ఎవరూ లేరు. గంటకుపైగా అక్కడే కూర్చున్నా ఎవరూ రాకపోవడంతో పాప బాగా ఏడుస్తున్నది. దీంతో పాల కోసం ఏడుస్తున్నదని పాపను ప్రసూతి వార్డులోకి తీసుకువచ్చాం. మేము తీసుకెళ్లాం కాబట్టి సరిపోయింది. ఎవరైనా బయటి వ్యక్తులు పాపను తీసుకెళ్తే మా పరిస్థితి ఏంటి. పేషెంట్లకు సైతం సెలైన్ పెట్టి వెళ్లారు. అది అయిపోయినా చాలాసేపటి వరకు సిబ్బంది ఎవరూ రాకపోవడంతో వెంట వచ్చిన వారే సెలైన్ తీసేశారు.

**-వెంకటేశం, బ్రాహ్మణపల్లి, అందోల్ మండలం (సంగారెడ్డి జిల్లా)**

**చర్యలు తీసుకుంటాం..**

జోగిపేట ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా తగిన చర్యలు చేపడుతున్నాం. దవాఖానలో పైప్‌లైన్లు, ఇతరత్రా పనులు చేపడుతునందున అక్కడక్కడ కొంత పారిశుధ్య పనులు సరిగా చేపట్టడంలో ఆలస్యం జరుగుతున్నది. ప్రసూతి వార్డులో డబ్బులు అడుగుతున్నారని గతంలో కొంతమంది సిబ్బందిపై చర్యలు తీసుకున్నాం. ఇంకా ఎవరైనా డబ్బులు అడిగితే కఠిన చర్యలు తీసుకుంటాం. బుధవారం పేషెంట్‌కు సెలైన్ పెట్టి అయిపోయిన తర్వాత కూడా దానిని తొలిగించకపోవడంపై తగిన విచారణ జరిపి సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

**- డాక్టర్ రమేశ్, జోగిపేట దవాఖాన సూపరింటెండెంట్**